సాక్షి
కామారెడ్డి

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



అసౌకర్యం కలగకుండా చూడాలి

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ ఫణీంద్ర రెడ్డి ఆదేశించారు.

- 10లో ▸



ఆటపాటలతో విద్య..

అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో సృజనాత్మక విద్య అందిస్తున్నామని ఎల్లారెడ్డి సీడీపీవో స్వరూపారాణి పేర్కొన్నారు.

- 11లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
43.8 /23.8

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాచారెడ్డి: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి పేర్కొన్నారు. బుధవారం మాచారెడ్డిలో నిర్వహించిన న్యాయసదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెటుకోవద్దన్నారు. ఆడపిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై పోక్సో కేసులు నమోదవుతాయన్నారు. అంగవైకల్యంతో ఉన్న వారిని గౌరవించాలన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో దేవేందర్‌రావు, మాచారెడ్డి హైస్కూల్ హెచ్‌ఎం వెంకటాచారి, ఐఆర్‌బీ మంజుల, ఫిజియోథెరపిస్ట్ నవీన్, సిబ్బంది నర్సింహాచారి, సందీప్, నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాంగ్రెస్ కార్యక్రమాల పర్యవేక్షణ, అమలు కోసం ఆ పార్టీ జిల్లాలకు పరిశీలకులను నియమించింది. కామారెడ్డి జిల్లాకు నాగుల సత్యనారాయణగౌడ్, బాస వేణుగోపాల్‌యాదవ్‌లను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు, పార్టీ నేతలతో కలిసి పార్టీ కార్యక్రమాల అమలు గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పరిశీలకులకు సూచించారు. నిజామాబాద్ జిల్లా పరిశీలకులుగా బల్మూరి వెంకట్, తిరుపతి నియమితులయ్యారు.

మహిళను కాపాడిన వారిని అభినందించిన ఎస్పీ



కామారెడ్డి క్రైం: ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన ఓ వ్యక్తిని, పట్టణ పోలీసులను ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం అభినందించారు. ఈనెల 21 న జిల్లాకేంద్రానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు జయశంకర్ కాలనీ సమీపంలోని రైలు పట్టాలపై పడుకుంది. దీనిని గమనించిన దేవ కుమార్ అనే వ్యక్తి డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ నరసింహులు, హోంగార్డు వసంత్ ఆమెను కాపాడి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమాచారం ఇచ్చిన దేవ కుమార్‌తో పాటు మహిళ ప్రాణాలు కాపాడిన సిబ్బందిని ఎస్పీ బుధవారం జిల్లా కార్యాలయంలో అభినందించి నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

నేడు మంత్రి జూపల్లి రాక

బాన్సువాడ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం బాన్సువాడకు రానున్నారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలలో పాల్గొంటారని పేర్కొన్నారు. వేడుకలకు విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

వచ్చేనెలలో సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను వచ్చేనెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. రీవెరిఫికేషన్, రీవాల్యుయేషన్‌తో పాటు ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించడానికి ఈనెల 30 వరకు అవకాశం ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాల (2025–26) కోసం అర్హులైనవారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి తదితర అంశాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన బాలబాలికలు జూలై 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలబాలికలు 5 నుంచి 18 ఏళ్లలోపు వారై ఉండాలని జిల్లా సంక్షేమాధికారి పేర్కొన్నారు.

జొన్న రైతుకు ఊరట!

- కొనుగోలు పరిమితి పెంచిన సర్కారు
- ఎకరానికి 8.65 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్లకు పెంపు
- అదనంగా మరో మూడు జొన్న కొనుగోలు కేంద్రాలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జొన్న రైతుకు సర్కారు ఊరటనిచ్చింది. కొనుగోలు పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా జిల్లాకు అదనంగా మరో మూడు కొనుగోలు కేంద్రాలను మంజూరు చేసింది. దీంతో జొన్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సింగీతంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో నవ్య(ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి యాసంగి సీజన్‌లో 71,104 ఎకరాల్లో జొన్న పంట సాగయ్యింది. గతేడాది 20 వేల ఎకరాల్లో మాత్రమే ఈ పంట సాగవ్వడం గమనార్హం. కాగా ఈ పంటలో రెండు రకాలున్నాయి. నీటి తడి అందించకుండా పండించే సాధారణ రకం ఒకటి కాగా మూడు నుంచి నాలుగు తడులు అందించడం ద్వారా పండే నీళ్ల రకం జొన్న మరొకటి.. ఒక్కో ఎకరానికి సాధారణ రకం 8 నుంచి 10 క్వింటాళ్లు, నీరందించే రకానికి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

19 కి చేరిన కేంద్రాలు..

జొన్న సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జిల్లా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏటా జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు జొన్నలు కొంటున్నారు. జిల్లాలోని మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, గాంధారి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో జొన్న పంటను ఎక్కువగా సాగు చేస్తారు. కొంత ఆలస్యం అయినప్పటికీ ఈనెల 10 న జిల్లాలో 16 చోట్ల జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్వింటాలుకు రూ. 3,371 మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, పుల్కల్, పెద్దకొడప్‌గల్, చిన్నకొడప్‌గల్, బోర్లం, కారేగాం, గున్కుల్, తిమ్మానగర్, గాంధారి, ముదెల్లి, ఆర్గొండ, పద్మాజీవాడి, ఎల్లారెడ్డిలలో కేంద్రాలు మంజూరు చేయగా.. కొన్నింటిని ప్రారంభించారు. తాజాగా మరో మూడు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని మల్లూర్, అచ్చంపేట, తాండూర్ కిచ్చన్నపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో మరో 3 జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఎకరానికి 8.65 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేసేది. ఈసారి నిబంధనలు మారాయి. మద్దతు ధర చెల్లిస్తూ ఎకరానికి 14 క్వింటాళ్ల చొప్పున జొన్నలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– మహేశ్, డీఎం, మార్క్‌ఫెడ్

కొనుగోళ్లలో పరిమితి..

గతంలో కొనుగోలు కేంద్రాలలో ఎకరానికి 8.65 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసేవారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో మిగిలిన పంటను తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. దీనిని గమనించిన సర్కారు.. కొనుగోలు పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎకరానికి 14 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది.

సకాలంలో ప్రారంభం కాక..

ఈసారి సకాలంలో జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో పలువురు రైతులు వ్యాపారులకు పంటను అమ్ముకున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,371 ఉండగా మార్కెట్‌లో రూ.1,800 నుంచి రూ. 2 వేల వరకు మాత్రమే చెల్లించారు. దీంతో రైతులు నష్టపోయారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా కొనుగోలు పరిమితిని కూడా పెంచడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిగో నా తరగతి గది..

- చదువుకున్న బడిని చూసి డీఈవో సంతోషం

బాన్సువాడ రూరల్: దేశాయిపేట్ జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం జిల్లా ఇన్‌చార్జి డీఈవో పార్శి అశోక్‌కుమార్ సందర్శించారు. ఆయన స్వస్థలం సోమేశ్వర్ గ్రామం. ప్రస్తుతం నిజామాబాద్ డీఈవోగా పనిచేస్తున్నారు. కామారెడ్డి డీఈవో రాజు సెలవుపై వెళ్లడంతో ఆయన జిల్లా ఇన్‌చార్జి డీఈవో బాధ్యతలు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం దేశాయిపేట్ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో కలియదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నానన్నారు. తాను చదువుకున్న పాఠశాలను చూసి ఆయన మురిసిపోయారు.



తాను చదువుకున్న తరగతి గది వద్ద డీఈవో పార్శి అశోక్‌కుమార్

కామారెడ్డి ఇన్‌చార్జి డీఈవోగా అశోక్

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి డీఈవో పది రోజులపాటు సెలవులో వెళ్లడంతో అశోక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

- అంతరాయాలు లేకుండా చూడండి
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: వినియోగదారులకు అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఇందుకోసం సబ్‌స్టేషన్లలో మరింతగా నూతన సాంకేతికతను అభివృద్ధి చేయాలన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని సిరిసిల్లరోడ్డులోని సబ్‌స్టేషన్, పవర్ హౌస్ కాంపౌండ్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ లైన్లలో సమస్యల పరిష్కారానికి ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్స్, ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా సమస్య వచ్చిన లోకేషన్‌ను గుర్తించి సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం పంపి పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. రైతులకు వేగంగా కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డెరెక్టర్ తిరుపతిరెడ్డి, కమర్షియల్ డైరెక్టర్ సదర్‌లాల్, చీఫ్ ఇంజినీర్ అశోక్, జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

- ఆధార్ తరహాలో భూధార్ కార్డులు ఇస్తాం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గాంధారి/సదాశివనగర్: భూ భారతితో రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. బుధవారం గాంధారి, సదాశివనగర్ రైతువేదికలలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులలో ఆయన పాల్గొన్నారు. భూ భారతి చట్టం గురించి ప్రజలకు వివరించారు. భూముల సమస్యల పరిష్కారం కోసం రెండంచెల వ్యవస్థ ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాదాబైనామాలపై కొనుగోలు చేసిన వ్యవసాయ భూముల సమస్యలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంటుందన్నారు. 2014 ముందు సాదాబైనామాలపై కొనుగోలు చేసి, అక్టోబర్ 2020 లో క్రమబద్ధీకరణ కోసం చేసిన దరఖాస్తులను సంబంధిత ఆర్డీవోలు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తారన్నారు. అలాగే రైతులకు ఆధార్ తరహాలో భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమాలలో గాంధారి మండల ప్రత్యేకాధికారి మురళి, తహసీల్దార్లు రేణుక చౌహాన్, గంగాసాగర్, ఎంపీడీవోలు రాజేశ్వర్, సంతోష్‌కుమార్, సదాశివనగర్ ఏవో ప్రజాపతి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



లింగంపేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లింగంపేట: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మమత రేకుల షెడ్డును పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. ఆమె భర్త మరణించడంతో ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నట్లు తెలిపింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరింది. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలి

- రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించండి
- నేర సమీక్షలో ఎస్పీ రాజేశ్ చంద్ర



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: కేసులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిశోధన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో నాణ్యమైన విచారణ చేపట్టి బాధితులకు అండగా నిలవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియాగా గుర్తించాలన్నారు. అక్కడ సూచికల బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. తప్పుడు నంబర్ ప్లేట్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నేరాల నియంత్రణతో పాటు, జరిగిన నేరాలను ఛేదించడంలో ఎంతగానో ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. స్వచ్ఛందంగా ముందుకువచ్చి ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రస్తుత కాలంలో వెలుగుచూస్తున్న వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ, ఎస్బీ సీఐ జార్జ్, డీసీఆర్బీ సీఐ మురళి, జిల్లాలోని అన్ని ఠాణాల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'ఎక్స్'లో జిల్లా బాస్‌లు యాక్టివ్!

- కలెక్టర్, ఎస్పీలకు భారీగా ఫాలోవర్లు
- రోజువారీ కార్యక్రమాల అప్‌డేట్..



ఎక్స్‌లో కలెక్టర్ అకౌంట్



కామారెడ్డి ఎస్పీ ఖాతా..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సామాజిక మాధ్యమాలు ముఖ్యంగా 'ఎక్స్'లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర యాక్టివ్‌గా ఉంటున్నారు. రోజువారీగా జరిగే కార్యక్రమాలు, సక్సెస్‌లు ఎప్పటికప్పుడు ఎక్స్ ఖాతాలలో పోస్ట్ చేస్తున్నారు. తమ బాస్‌లు పోస్ట్ చేసిన వాటిని అధికారులు, సిబ్బంది వివిధ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. కలెక్టర్ కామారెడ్డి పేరుతో ఉన్న ఖాతాలో 7,628 మంది ఫాలోవర్స్ ఉన్నారు. కలెక్టర్ సంగ్వాన్ రోజూ తాను పాల్గొన్న ముఖ్యమైన కార్యక్రమాలు, ముఖ్యమైన విషయాలను అందులో పోస్ట్ చేస్తున్నారు. దీంతో వేలాది మంది వాటిని చూస్తున్నారు. అలాగే ఎస్పీ కామారెడ్డి పేరుతో ఉన్న ఖాతాను 5,813 మంది అనుసరిస్తున్నారు. ఎస్పీ రాజేశ్ చంద్ర కూడా రోజూ చాలా అంశాలను పోస్ట్ చేస్తున్నారు. వివిధ కేసుల్లో నేరస్తులను అరెస్టు చేసిన అంశాలతో పాటు పోలీసు అధికారులతో సమీక్షలు, వివిధ సందర్భాల్లో సిబ్బంది చేసిన కృషిని మెచ్చుకుంటూ వారిని అభినందించిన ఫొటోలు పోస్ట్ చేస్తున్నారు. ఇలా కలెక్టర్, ఎస్పీలు ఎప్పటికప్పుడు 'ఎక్స్'లో క్రియాశీలకంగా ఉంటూ వివిధ విషయాలను పోస్ట్ చేస్తుండగా.. వాటిని కింది స్థాయి సిబ్బంది, అధికారులు ఇతర సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు.



● అమరులకు నివాళి

భిక్కనూరులో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న ప్రజలు

భిక్కనూరు: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిపై బుధవారం జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ఈ దాడిలో మరణించినవారి ఆత్మశాంతికోసం కొవ్వొత్తులతో ర్యాలీలు తీశారు. భిక్కనూరు మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. యువకులు పెద్ద ఎత్తున పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, నర్సారెడ్డి, రమేష్, రాజమౌళి, మధుసూదన్, వెంకటేశం, జైపాల్‌రెడ్డి, రాజబాబుగౌడ్, విలాస్‌రెడ్డి, నర్సింలు, రమేష్, కిరణ్, లక్ష్మణ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాగా బిచ్కుంద.. గెజిట్ విడుదల

- మూడు జీపీల విలీనం
- రికార్డులు స్వాధీనం చేసుకోనున్న మున్సిపల్ శాఖ

బిచ్కుంద: మున్సిపాలిటీగా బిచ్కుందను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం గెజిట్ విడుదల చేసింది. దీంతో త్వరలోనే మున్సిపల్ శాఖ నాలుగు గ్రామాల రికార్డులు స్వాధీనం చేసుకోనుంది. జీపీ అధికారులకు పది పదిహేను రోజులు సమయం ఇచ్చి రికార్డులు స్వాధీనం చేసుకొని ఎన్నికల వరకు ప్రత్యేక అధికారిని నియమించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీల అధికారులు పెండింగ్‌లో ఉన్న పనులు, రికార్డులను సరి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. బిచ్కుంద మండల కేంద్రంతోపాటు కందర్‌పల్లి, దౌల్తాపూర్, గోపన్‌పల్లి గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం రెండు నెలల క్రితం బిచ్కుంద మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

1955లో పంచాయతీగా..

బిచ్కుంద 1955 లో గ్రామ పంచాయతీగా ఏర్పాటయ్యింది. అప్పట్లో మహారాష్ట్రలో ఉండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాలు ఏపీలో విలీనమయ్యాయి. బిచ్కుంద పట్టణం ఉత్తరం వైపు గోపన్‌పల్లి గ్రామం వరకు విస్తరించింది. దక్షిణం వైపు దౌల్తాపూర్, తూర్పువైపు మల్కాపూర్ శివారు దడ్డి చౌరస్తా వరకు, పశ్చిమం వైపు కందర్‌పల్లి గ్రామం వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా చేశారు. గ్రామ పంచాయతీలను బల్దియాగా అప్‌గ్రేడ్ చేయడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తారని, తాగునీటి సరఫరా మెరుగవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

క్లుప్తంగా

డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన బైకు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో జరుగుతున్న 765డీ రోడ్డు పనులలో అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బుధవారం కుర్లం నుంచి నెమ్లి వైపు వెళ్తుండగా మండలకేంద్రంలో ద్విచక్ర వాహనం డ్రెయినేజీలోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న కుర్లం గ్రామానికి చెందిన శ్రీను, భీమయ్య, సంజీవ్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్సులో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, సోమవారం రాత్రి కారు అదుపు తప్పి డ్రెయినేజీ కోసం తవ్విన గుంతలో పడింది. రోడ్డు పనుల నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలి



మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నమోదు పెరిగేలా బడిబాట కార్యక్రమం ప్రణాళికతో నిర్వహించాలని డీఈవో ఎస్.రాజు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యసనాభివృద్ధి పెరగడానికి వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌పీల నియామకాల కోసం మండల, జిల్లా స్థాయిలో ఆర్‌పీల ప్రతిపాదనలు పంపాలన్నారు. మే 1 నుంచి 15వ తేది వరకు మండల స్థాయిలో సమ్మర్ క్యాంపులు నిర్వహించాలన్నారు. బాలిక శ్రేయస్సు దృష్ట్యా ప్రతి స్కూల్‌లో జీఈసీఈ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోక్సో చట్టంపై ప్రతి ఉపాధ్యాయుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి డీఈవో అశోక్, సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగేందర్, రమణరావు, కృష్ణచైతన్య, పరీక్షల విభాగం కమిషనర్ బలరాం, డీసీఈబీ కార్యదర్శి నీలలింగం, ఎంఈవోలు, నోడల్ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాన్కంపేటలో చోరీ

- 5 తులాల బంగారం, రూ.5 వేల నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు దుండగులు ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జాన్కంపేట్ గ్రామంలోని 7వ వార్డులో నివసిస్తున్న పారిపల్లి శంకర్ కుటుంబసభ్యులు వేసవికాలం నేపథ్యంలో ఉక్కపోత భరించలేక తలుపులు తెరిచి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 3 తులాల బంగారంతోపాటు 5 వేల నగదు అపహరించారు. అనంతరం ఆరు బయట నిద్రిస్తున్న శంకర్ భార్య రుక్మాబాయి మెడలో నుంచి సుమారు 2 తులాల పుస్తెలతాడును దొంగిలించుకొని వెళుతుండగా అలికిడి కాగా నిద్ర నుంచి తేరుకున్న కుటుంబసభ్యులు దొంగను చూసి వెంబడించారు. దొంగ దొరకకపోవడంతో బుధవారం ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

స్కావెంజర్ డబ్బులు కాజేత

- హజ్గుల్ ఎస్సీవాడ పీఎస్ స్కూల్‌లో ఆలస్యంగా వెలుగులోకి..
- చర్యలు తీసుకోవాలని వినతి



హజ్గుల్ పీఎస్ స్కూల్

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మండలం హజ్గుల్ గ్రామంలోని ఎస్సీవాడ ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్ డబ్బులను హెచ్‌ఎం కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా..హజ్గుల్ గ్రామంలోని ఎస్సీవాడ ప్రాథమిక పాఠశాల ప్రారంభ సమయంలో వసీమాబేగం స్కావెంజర్‌గా చేరింది. వసీమా బేగంకు ప్రతినెల రూ.6 వేల వేతనాన్ని ప్రభుత్వం స్కూల్ అకౌంట్‌లో వేస్తుంది. స్కూల్ అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ రాంబాయి, హెచ్‌ఎం సంజీవ్ ఇద్దరు సంతకాలతో డబ్బులు డ్రా చేయాల్సి ఉంటుంది. హెచ్‌ఎం సంజీవ్ నెలకు రూ.4 వేలు చొప్పున స్కావెంజర్‌కు వేతనం ఇచ్చిన మిగితా డబ్బులు మింగేశాడు. నవంబర్ నుంచి మార్చి వరకు రూ.6 వేల చొప్పున ఐదు నెలల వేతనం రూ.30 వేలు హెచ్‌ఎం డ్రా చేసుకొని స్కావెంజర్ వసీమా బేగంకు రూ.25 వేలు మాత్రమే ఇచ్చాడు. .

ఇప్పుడవి ఐదు వేలు, గతంలోనివి ఎనిమిది వేలు కలిపి మొత్తం రూ.13 వేలు హెచ్‌ఎం సంజీవ్ తన జేబులో వేసుకున్నాడని స్కావెంజర్ వసీమాబేగం వారం రోజుల క్రితం పాఠశాల తనిఖీకి వచ్చిన ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి కి ఫిర్యాదు చేసింది. ఈవిషయమై హెచ్‌ఎం సంజీవ్‌ను ఎంఈవో మందలించి అక్రమంగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని ఆదేశించినా ఇవ్వలేదని స్కావెంజర్ వసీమాబేగం తెలిపింది. ఈవిషయంపై ఉన్నతాధికారులు స్పందించి శాఖపరమైన చర్యలు తీసుకొని వసీమాబేగంకు డబ్బులు ఇప్పించాలని గ్రామస్తులు కోరతున్నారు.

చిల్లి గవ్వ ఇవ్వనన్నాడు



పనికి తగ్గట్టు వేతనం ఇస్తాను. ఇచ్చినన్ని తీసుకో చిల్లిగవ్వ ఇవ్వనని హెచ్‌ఎం సంజీవ్ సారు చెబుతున్నాడు. అప్పడప్పుడు వచ్చిన వేతనంలో నుంచి కొన్ని కట్ చేసి ఇస్తున్నాడు ఇప్పటి వరకు రూ.13 వేలు కట్ చేసి సారు జేబులో వేసుకున్నాడు. ఎంఈవో సార్ చెప్పినా ఇవ్వడం లేదు. –వసీమాబేగం, స్కావెంజర్

హెచ్‌ఎం డబ్బులు తీసుకున్నది వాస్తవమే

స్కావెంజర్ వేతనంలో కోత విధించి మిగతా డబ్బులు హెచ్‌ఎం సంజీవ్ సారు తీసుకున్నది నిజమే. నేను కూడా సార్‌కు చెప్పి బెదిరించిన.. డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. స్కావెంజర్ వేతనం కోత విధించి జేబులో వేసుకోవడం పద్ధతి కాదు. హెచ్‌ఎంపై అధికారులకు ఫిర్యాదు చేస్తాను. స్కూల్ గ్రాంట్ వివరాలు కూడా ఇవ్వడం లేదు. – రాంబాయి, స్కూల్ చైర్మన్, హస్గుల్

ఆదర్శప్రాయుడు బుద్దె రాజేశ్వర్





బుద్దె రాజేశ్వర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కుటుంబసభ్యులు, సాలూర బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన రాజేశ్వర్ విగ్రహం

- ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బోధన్ : తుదిశ్వాస వరకు ప్రజలకు సేవలందించిన దివంగత బుద్దె రాజేశ్వర్ ఆదర్శప్రాయుడని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బోధన్ మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త సీనియర్ నేత బుద్దె రాజేశ్వర్ సాలూర గ్రామాభివృద్ధికి, ప్రజా సేవలకు జ్ఞాపకార్థంగా గ్రామస్తులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాజేశ్వర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజేశ్వర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ పోచారం శ్రీనివాస్ రెడ్డి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. సర్పంచ్, ఎంపీటీసీ, సొసైటీ చైర్మన్ పదవుల్లో సుదీర్ఘకాలంపాటు బాధ్యతలు నిర్వర్తించిన రాజేశ్వర్ తన వద్దకు ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వచ్చేవారని, ఏనాడూ వ్యక్తిగత పనులు కోరలేదన్నారు. రైతుల చిరకాల వాంఛ అయిన మంజీర నదిపై ఎత్తిపోతల పథకాన్ని పట్టుబట్టి సాధించాడని, ఆ ఎత్తిపోతల పథకానికి బుద్దె రాజేశ్వర్ పేరు పెట్టాలని సమష్టి ఆమోదంతో తీర్మానించాలని గ్రామస్తులను కోరారు. స్థలదాత ఇల్తెపు బొర్ర గంగారాం, విగ్రహదాత మిద్దెల రాజును ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో రాజేశ్వర్ సతీమణి బుద్దె సావిత్రి, బోధన్, కోటగిరి ఏఎంసీ చైర్మన్లు చీల శంకర్, హన్మంతు, ఏసీపీ శ్రీనివాస్, టీపీసీసీ డెలిగెట్ బీ గంగాశంకర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు, బీఆర్ఎస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోగినేని నరేంద్రబాబు, మందర్నా రవి, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, కోటగిరి మాజీ జడ్పీటీసీ హెగ్డోలి శంకర్, నాయకులు అల్లె రమేశ్, గణపతి రెడ్డి, బిల్ల రాంమోహన్, డాక్టర్ కొలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే



మాట్లాడుతున్న జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బుధవారం ఆయన లింగంపేట మండలంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామ స్థాయి నుంచే వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతి మండలం నుంచి 500 మందితో ఎల్లారెడ్డి నియోజక వర్గం నుంచి 3వేల మందిని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, గన్యానాయక్, శ్రీకాంత్, నర్సింలు, సురెందర్, ఆయా గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవ్ ద గర్ల్స్ సొసైటీ తరపున పెళ్లి సాయం అందజేత

రామారెడ్డి : రామారెడ్డికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన భార్గవి అనే యువతి అనే వివాహానికి సేవ్ ద గర్ల్స్ సొసైటీ తరపున బుధవారం రూ.21 వేల ఆర్థిక సాయంను పెళ్లి కానుకగా అందజేశారు. సేవ్ ద గర్ల్స్ సొసైటీ సంస్థను చంచల్‌గుడా జైల్ సూపర్‌డెండెట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

బాలసదన్‌కు అనాథ విద్యార్థులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఐదుగురు అనాథ విద్యార్థులు చదువుతున్నారు. వీరిని పాఠశాల సిబ్బంది కామారెడ్డిలోని బాలసదన్‌కు పంపించారు.

రావుల మధుకు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి రావుల మధు పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. వర్సిటీ అధ్యాపకుడు వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'ప్రిపరేషన్ డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నావెల్ నానో క్రిస్టలైన్ సిరియా బేస్డ్ ఎట్రోజీనియస్ క్యాటలిస్ట్ ఫర్ ది కటలిటిక్ ఎవాల్యూషన్ ఆఫ్ సెలెక్టివ్ ఆక్సిడేషన్ ఆఫ్ ఆరోమాటిక్ అమైన్స్' అనే అంశంపై మధు పరిశోధన జరిపారు. బుధవారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ టీ సవిత జోత్స్న ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి, సైన్స్ డీన్ ఆచార్య కే సంపత్ కుమార్, బోయపాటి శిరీష, అధ్యా పకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లింగంపేటలో మహిళ దారుణ హత్య



డాగ్‌స్క్వాడ్‌తో గాలిస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన అమ్ముల లక్ష్మి(40) అనే మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. లక్ష్మి భర్త కొంతకాలం క్రితం మృతి చెందడంతో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. ఆమెకున్న ఒక్కాగానొక్క కూతురు శిరీషకు పెళ్లి చేసి పంపడంతో లక్ష్మి మాత్రమే ఇంట్లో ఉంటోంది. ఈ నెల 20న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చీరతో గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఇంటికి తాళం వేసి వెళ్లగా, బుధవారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తాళం పగులగొట్టి తలుపులు తెరిచి చూడగా లక్ష్మి మృతదేహం కుళ్లిపోయినట్లు గుర్తించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆనవాళ్లు సేకరించారు. మృతురాలి కూతురు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ పరిశీలించారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



శోభ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన ల్యాగల శోభ(45) అనే మహిళ బుధవారం ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. గత నాలుగైదు సంవత్సరాలుగా శోభ మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించేదని, ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా తగ్గలేదు. మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో బాత్‌రూమ్ వద్ద ఉన్న కర్రకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. భర్త పర్వయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రెంజల్(బోధన్): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష విధించగా మరో ముగ్గురికి బోధన్ ద్వితీయ శ్రేణి అదనపు న్యాయమూర్తి జరిమానా వేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం సాటాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా తాగి వాహనాలు నడిపిన వారిని పట్టుకొని కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. ముగ్గురికి రెండు రోజుల జైలు, మరో ముగ్గురికి రూ.4 వేల చొప్పున జరిమానా విధించారు.

కిరాణా షాప్ యజమానికి..

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్దేశిత సమయానికి మించి కిరాణాదుకాణాన్ని తెరిచి ఉంచిన యజమాని షేక్ జుబేర్ హాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసీన్ ఆరా ఫత్ బుధవారం తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

హత్య కేసు కొలిక్కి!

రామారెడ్డి: రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హత్య కేసు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ధర్పల్లి మండలం దొనకల్ అటవీ ప్రాంతంలో మృతుడి ఎముకలను నిందితుల ద్వారా గుర్తించినట్లుగా తెలిసింది. కాగా, ఈ హత్య 2024 ఫిబ్రవరి నెలలో జరిగినట్లు సమాచారం. మృతుడు గల్ఫ్ వెళ్లినట్లుగా బంధువులను నమ్మించిన భార్య..ప్రియుడితోపాటు మరో ఇద్దరితో కలిసి హత్య చేసినట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ హత్య కేసుపై రామారెడ్డి ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా గురువారం వరకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని, ప్రస్తుతం కేసు విచారణలో ఉందని తెలిపారు. కాగా, పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిందితులకు శిక్షపడేలా ఆధారాలు సేకరించాలని మృతుడి సోదరుడు, బంధువులు కోరుతున్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామంలోని కల్లు బట్టి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుళ్లు గంగాధర్, సుబ్రమణ్యం, జావేద్, నర్సయ్యలతో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. పేకాడుతున్న వారి నుంచి రూ. 11.820 నగదుతోపాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు ఎస్సై చేసినట్లు చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



కామారెడ్డి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సౌత్‌క్యాంపస్ పార్ట్ టైం అధ్యాపకులు

భిక్కనూరు: యునివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సౌత్‌క్యాంపస్‌లో బుధవారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులు పార్ట్ టైం అధ్యాపకుల సమ్మెకు మద్దతుగా తరగతులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించి సమ్మె శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. తదుపరి పార్ట్ టైం అధ్యాపకులు కామారెడ్డికి వెళ్లి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డిని కల్సి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్ట్ టైం అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రతినిధులు కనకయ్య, శ్రీను రమేష్, శ్రీకాంత్‌గౌడ్, పోతన వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి ఫణీంద్ర రెడ్డి

రాష్ట్ర నోడల్ అధికారి ఫణీంద్ర రెడ్డి

కామారెడ్డి క్రైం: రైతులకు అసౌకర్యం కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలని రాష్ట్ర నోడల్ అధికారి ఫణీంద్ర రెడ్డి సూచించారు. బుధవారం ఆయన జిల్లాలో పర్యటించారు. భిక్కనూర్‌తో పాటు మండలంలోని జంగంపల్లి అంతంపల్లి, కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం కామారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేసి రైతులకు 72 గంటల్లోగా నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, డీసీవో రామ్మోహన్, డీఆర్‌డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- బయటకు రావాలంటే జంకుతున్న జనాలు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



రోడ్లపై ఇబ్బందులు పడుతున్న మహిళలు

కామారెడ్డి టౌన్: సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. జిల్లా వ్యాప్తంగా రోజు 43 డిగ్రీల ఉష్ణోగత కంటే తగ్గకుండా ఎండ మండుతుంది. దీంతో జనాలు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు బయటకు రావడం లేరు. కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు లేకుండా ఇళ్లలో ఉండటం లేరు. నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని ప్రధాన రోడ్లు సిరిసిల్లా రోడ్, జేపీఎన్, సుభాస్, స్టేషన్‌రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, దేవునిపల్లి రోడ్, జాతీయరహదారి, కొత్తబస్టాండ్, విద్యానగర్, అశోక్‌నగర్ కాలనీరోడ్డు ఇలా రోడ్లన్ని జనాలు లేక నిర్మానుష్యంగా కనబడుతున్నాయి.



కొత్తబస్టాండ్ ముందు నిర్మానుష్యంగా రోడ్డు



జిల్లా కేంద్రంలో గొడుగుల కింద వ్యాపారులు

భూభారతి పోర్టల్‌తో రైతుల సమస్యలు పరిష్కారం



జల్దిపల్లి సదస్సులో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా రైతులు సమస్యలు పరిష్కారం కానున్నాయని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి వెల్లడించారు. బుధవారం లింగంపేట మండలంలోని జల్దిపల్లి, రాంపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జల్దిపల్లిలో ఆమె మాట్లాడారు. ఇచ్చిన సమస్యను క్షుణంగా విచారించి పరిష్కారం చేయన్నుట్లు ఆమె పేర్కొన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ భూముల వివాదాలను ఇరు శాఖల అధికారులు కలిసి సంయుక్తంగా సర్వే చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలోని జల్దిపల్లి గ్రామంలో 18, రాంపూర్ గ్రామంలో 179 మంది సమస్యలపై దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ, అటవీ శాఖ వివాదంలో మరికొన్ని భూములు ఉన్నాయన్నారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, ఆర్ఐ కిరణ్, ఎఫ్ఆర్‌వో ఓంకార్, అధికారులు, తదితరులున్నారు.

అగ్నివీరులు.. అవుతారా?

- నేరుగా భారత సైన్యంలో చేరే అవకాశం
- దరఖాస్తుకు రేపే చివరి తేదీ



www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఖలీల్‌వాడి: త్రివిధ దళాల్లో చేరాలనే ఆసక్తి ఉన్న యువకులను ఇండియన్ ఆర్మీ ప్రోత్సహిస్తోంది. అగ్నిపథ్ పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం రెండుసార్లు అగ్నివీర్ ఎంపికలు నిర్వహిస్తోంది. అగ్నివీరులుగా ఎంపికైన వారికి నాలుగేళ్లపాటు ఐదంకెల వేతనం అందిస్తోంది. అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతుండడంతో గడువు తేదీని పొడిగించింది. అయితే ఈ ఉద్యోగం సాధించేందుకు గల అర్హతలు, ఫిజికల్ టెస్ట్, రాత పరీక్ష వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

అర్హతలు:

- అభ్యర్థుల వయస్సు 17.5 నుంచి 21 సంవత్సరాల వరకు ఉండాలి. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలి.
- ఫిజికల్ టెస్ట్‌లో 1600 మీటర్ల పరుగు, పుల్ అప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్సింగ్, డిచ్ పరీక్షల్లో అర్హత సాధించాలి.

పరుగు పందెం..

అగ్నివీర్‌కు మొదటి పరీక్ష పరుగు పందెం. 1600 మీటర్ల పరుగును 5 నిమిషాల లోపు, అంతేకంటే తక్కువ సమయంలో పూర్తి చేయాలి. ఒకేసారి 300 మందికి పోటీ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఫెయిల్ అయితే మిగితా పరీక్షలకు అవకాశం ఉండదు.

జిగ్ జాగ్ బ్యాలెన్సింగ్, డిచ్ :

- పొడువుగా వంకర టింకరగా ఉన్న కర్ర(చెక్క)పై అభ్యర్థులు కిందపడకుండా నడుచుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. దీనినే జిగ్ జాగ్ బ్యాలెన్సింగ్ అంటారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతోనే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఉంటుంది.
- పరుగెత్తుకుంటూ వచ్చి తొమ్మిది మీటర్ల గుంత అవతలి వైపు దూకాలి. దీనినే డచ్ పరీక్ష అంటారు. దీనికి కసరత్తు చేయాల్సి ఉంటుంది.

పుల్ అప్స్

ఈ పరీక్షలో పాస్ కావాలంటే తప్పనిసరిగా 10 పుల్ అప్స్ తీయాల్సి ఉంటుంది. ఎక్కువగా తీస్తే బోనస్ మార్కులు కూడా వస్తాయి. ఈ పరీక్ష చేస్తున్నప్పుడు ఎంపిక చేసే అధికారులు అభ్యర్థి వైపు చూస్తూ గట్టిగా అరుస్తారు. భయపడకుండా శ్వాస తీసుకుంటూ పుల్ అప్స్ చేయాలి.

అర్హత పరీక్ష

ఎంపికైన అభ్యర్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఇండియన్ ఆర్మీ కార్యాలయం నుంచి సమాచారం అందుతుంది. సమాచారం అందుకున్నవారు అధికారులు సూచించిన పత్రాలతోపాటు మెడికల్ టెస్ట్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రక్రియ పూర్తయిన తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్ అందిస్తారు. దీంతో భారతసైన్యంలో సైనికుడిగా శిక్షణ తీసుకుంటారు.